సాక్షి
వైఎస్సార్ జిల్లా

శుక్రవారం । 25 । జూలై । 2025



అప్పలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ 14 మాసాల్లో ఎన్ని అప్పలు చేశారో, అవి దేనికి ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని రవీంద్రనాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. -8లో



ఎనిమిది తరగతులు.. ముగ్గురు ఉపాధ్యాయులు

చింతలచెరువు గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులే ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు బోధిస్తున్నారు. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
32.0/25.0

వాతావరణం

జిల్లాలో గురువారం 25.0 - 32.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

27న ఎంపికలు

కడప వైఎస్సార్ సర్కిల్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి ఏసీఏ స్టేడియంలో ఈ నెల 27వ తేదీ అండర్ -23 సీనియర్స్ మహిళల క్రికెట్ ఎంపికలను నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ. రెడ్డి ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొనాలని కోరారు. 01-09-2002 తర్వాత జన్మించిన వాళ్లు అర్హులని పేర్కొన్నారు. అర్హులైన క్రీడాకారులు ఆధార్ కార్డు కాపీ, బర్త్ సర్టిఫికెట్(ఫారం 5), పాస్ పోర్ట్ సైజ్ ఫోటో తో పాటు తమ కిట్ బ్యాగులు కూడా తీసుకురావాలని సూచించారు.

ఆరుతడి పంటలకు మేలు

కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా కలసపాడులో అత్యధికంగా 36.4 మి.మీ వర్షం నమోదయింది. అలాగే కాశినాయనలో 23.8, పెద్దముడియంలో 18.2, పోరుమామిళ్లలో 15.4, దువ్వూరులో 9.2, రాజుపాలెంలో 8.6, గోపవరంలో 8, జమ్మలమడుగులో 7.2, బికోడూరు, మైదుకూరు, మైలవరంలలో 5.6, కమలాపురంలో 5.2, ఖాజీపేటలో 4.4, బద్వేల్‌లో 4.2, చాపాడులో 3.8, సిద్దవటంలో 3.4, బి.మఠంలో 3.2, వల్లూరు, పొద్దుటూరులలో 2.8, వేములలో 1.2 మి.మీ వర్షం నమోదైయింది. నాలుగు రోజులుగా జిల్లాలో కొనసాగుతున్న వర్షాలతో ఆరుతడి పంటలకు ఎంతో మేలు జరగనుంది.

జీసీడీఓగా రూతు ఆరోగ్య మేరీ



కడప ఎడ్యుకేషన్: జిల్లాలో బాలికాభివృద్ధి అధికారి(జిసిడిఓ)గా రూతు ఆరోగ్యమేరీ గురువారం బాధ్యతలను స్వీకరించారు. కడప ఎన్‌జీఓ కాలనీలోని సమగ్రశిక్ష కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని కస్తూర్బా బాలికల పాఠశాలల్లో నాణ్యమైన విద్యను బాలికలకు అందించేందుకు శాయశక్తుల కృషి చేస్తానని కేజీబీవీ పాఠశాలల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

కడప ఐసీడీఎస్ పీడీగా రమాదేవి



రమాదేవి



హైమావతి

కడప కోటిరెడ్డి సర్కిల్: జిల్లా ఐసీడీఎస్ అధికారిగా పి.రమాదేవిని నియమించారు. చింతకొమ్మదిన్నె సీడీపీఓ, అన్నమయ్య ఇన్‌చార్జ్ పీడీగా పని చేస్తూ పదోన్నతి పై కడప పీడీగా నియమిస్తూ ఆ శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ సూర్యకుమారి గురువారం రాత్రి ఉత్త ర్వులు జారీ చేశారు. అలాగే ప్రొద్దుటూరు సీడీపీఓగా పని చేస్తున్న హైమావతిని అన్నమయ్య పీడీగా నియమించారు. ప్రొద్దుటూరు అడిషనల్ సీడీపీఓగా పనిచేస్తున్న టి విమల రాణిని విజయనగరం పీడీగా నియమించారు. పోరుమామిళ్ల సీడీపీవోగా పనిచేస్తున్న ఐ విమలను శ్రీకాకుళం పీడీగా నియమిస్తూ ఉత్త ర్వులు జారీ చేశారు

ఇసుక తోడేళ్లు..!



వీరబల్లి మండల కేంద్రం సమీపంలోని మాండవ్య నదిలో పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు

- నదుల్లో భారీగా తవ్వకాలు
- ట్రాక్టర్ల ద్వారా తీసుకెళ్లి కొన్ని చోట్ల డంపులు
- చెరువులకు తప్పని గర్భశోకం
- కన్నెత్తి చూడని అధికారులు

సాక్షి రాయచోటి: 'అధికారం అండగా.. దండుకోవడమే దండిగా' అన్నట్లు ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ సహజ వనరులను దోపిడీ చేస్తున్నారు. అక్కడా, ఇక్కడా అని లేకుండా.. ఎక్కడ దొరికినా వదలకుండా కుమ్మేస్తున్నారు. ఆర్థికంగా బలపడటమే లక్ష్యంగా అందిన కాడికి దోచేస్తున్నారు. మద్యం, మట్టి, భూములు, కబ్జాలు ఇలా ఎక్కడపడితే అక్కడ.. ఉన్న కాడికి సర్దుకుంటున్నారు. సహజ వనరుల్లో ఒకటిగా ఉన్న ఇసుకలో భారీగా ధనాన్ని మూటగట్టుకుంటున్నారు. తెలుగు తమ్ముళ్లు యథేచ్ఛగా దోపిడీ పర్వం కొనసాగిస్తున్నా.. అధికారులు ఎవరూ అటువైపు కన్నెత్తి చూడడం లేదు.

చెయ్యేరు, బహుదా.. ఇలా అన్ని చోట్ల..

జిల్లాకు సంబంధించి తమ్ముళ్లకు ఆదాయ వనరులు ఇసుకలో బాగా లభిస్తున్నాయి. అందుకే ఎక్కడపడితే అక్కడ తవ్వేస్తున్నారు. ప్రధానంగా చెయ్యేరు, బాహుదా, మాం డవ్య, పెన్నా ఇలా అన్ని చోట్ల ఇసుకను అక్రమార్కులు తరలిస్తున్నారు. ట్రాక్టర్ల పేరుతో కొందరు అవసరానికంటూ తీసుకెళ్లి అధిక మొత్తానికి అమ్మేస్తున్నారు. నదులను చెరబట్టి ఉన్న కాడికి ఇసుకను తీసి అక్రమ వ్యాపారం కొనసాగిస్తున్నారు. సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల్లో ఒకచోట అనుమతులు తీసుకుని, మరో చోట తవ్వకాలు సాగిస్తున్నారు. నదుల వెంట ఇసుక ఉన్న ప్రాంతాన్ని గుర్తించి అక్రమార్కులు సొమ్ములు వెనకేసుకుంటున్నారు.




సుండుపల్లె మండలంలో పింఛా నుంచి బహుదా నదిలోకి వెళ్లే ఏరులో..

అడుగంటుతున్న భూగర్భ జలాలు

జిల్లాలోని చెరువుల్లో ఉన్న ఇసుకను పూర్తిగా తవ్వి తీస్తున్నారు. పీలేరు నియోజకవర్గం కలికిరి సమీపంలోని బ్రిడ్జి ఆనుకుని ఉన్న నదితోపాటు గుర్రకొండ ప్రాంతంతోపాటు మదనపల్లె పరిధిలోని వేంపల్లె పంచాయతీ, రామసముద్రం మండలం ఇలా అన్నిచోట్ల చెరువుల్లో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఇదేమని అడిగే అధికారులు లేకపోగా, ఈ విషయంగా ప్రశ్నించేవారు లేకపోవడంతో ట్రాక్టర్ల ద్వారా ఇసుక సరిహద్దులు దాటుతోంది. చెరువుల్లో ఇసుకను పెద్ద పెద్ద గుంతలుపెట్టి తీస్తుండటంతో సమీప గ్రామాల్లోని ప్రజలు బోరుబావులతోపాటు తాగునీటికి సమస్య ఏర్పడుతుందని, భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏది ఏమైనా జిల్లాలో అధికార పార్టీ నేతలు, వారి అనుచరులు ఇసుక తవ్వకాలు జోరుగా సాగిస్తూ అందిన కాడికి దోచుకునే పనిలో నిమగ్నమయ్యారు.

గ్రామాల్లో డంప్‌లు



టక్కోలి గ్రామ సచివాలయం వెనుక ఉన్న ఇసుక డంప్

సిద్దవటం: మండలంలోని టక్కోలి, లింగంపల్లె దేగనవాండ్లపల్లి, గ్రామాల పరిధిలోని పెన్నానది నుంచి ట్రాక్టర్‌లతో ఇసుక అక్రమంగా రవాణా చేసి పొదల చాటున, సచివాలయం వెనుక, మామిడి తోటల్లో ఇసుక డంప్‌లు ఏర్పాటు చేసుకున్నారని ఆయా గ్రామస్తులు తెలిపారు. ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా కట్టడి చేయడంలో అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని వారన్నారు. పెన్నానదికి నీరు వచ్చిన తరువాత ఇసుకను అక్రమ రవాణా చేసి విక్రయించేందుకు ఈ ఇసుక డంప్‌లను ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఒక ట్రాక్టర్ ఇసుకను కడపకు తీసుకెళ్లి రూ. 4వేలకు విక్రయించుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఇసుక దోపిడీకి గురికాకుండా అధికారులు దాడులు చేసి ఇసుక డంప్‌లను సీజ్ చేయాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.



పెన్నానది నుంచి ట్రాక్టర్‌లో ఇసుక తరలింపు

27న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఈనెల 27న ఆదివారం ఉదయం 9 గంటలకు బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్ 18, 20 మహిళలు, పురుషులకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ కార్యదర్శి వై.అహ్మద్ బాషా, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బసిరెడ్డి వీరకళ్యాణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభకనబరిచిన క్రీడాకారులను ఆగస్టు 09, 10, 11వ తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక చేస్తామని వివరించారు. మరిన్ని వివరాలకు 99496 86586, 8019880995 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

సోలాపూర్ - ధర్మవరానికి ప్రత్యేక రైలు

కలికిరి: సోలాపూర్ నుంచి ధర్మవరం వరకు ప్రత్యేక రైలు గురువారం నుంచి ప్రారంభమైంది. ట్రిన్ నంబరు 01437 ప్రతి గురువారం రాత్రి 11.20 గంటలకు సోలాపూర్‌లో బయలుదేరుతుంది. కుర్దువాడి, బర్షి టౌన్, లాతూర్‌కు శుక్రవారం ఉదయం 5 గంటలకు, యాద్‌గిరి, క్రిష్ణ, రాయ్‌చూర్ మీదుగా మంత్రాలయం రోడ్‌కు మధ్యాహ్నం 2.50 గంటలకు, ఆదోని, గుంతకల్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట మీదుగా తిరుపతి రాత్రి 10.15 గంటలకు.. పాకాల, పీలేరు, కలికిరి, మదనపల్లి రోడ్, మొలకలచెరువు, కదిరి మీదుగా ధర్మవరానికి మరుసటి రోజు శనివారం ఉదయం 3.30 గంటలకు చేరుకుంటుంది. అలాగే ట్రిన్ నంబరు 01438 ప్రతి శనివారం ఉదయం 5.30 గంటలకు ధర్మవరంలో బయల్దేరుతుంది. కలికిరికి 8.42 గంటలకు, పాకాలకు 9.55కు, తిరుపతికి 11.10 గంటలకు చేరుకుని, రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రికి సాయంత్రం 3.10 గంటలకు, గుత్తి, గుంతకల్, ఆదోని, మంత్రాలయం, రాయచూర్‌కు రాత్రి 7.20 గంటలకు, క్రిష్ణ, యాదగిరి మీదుగా లాతూర్‌కు ఆదివారం ఉదయం 6.35 గంటలకు సోలాపూర్‌కు 10.45 గంటలకు చేరుకుంటుంది. ఈ ట్రిన్ 01437 ఈ నెల 24 నుంచి సెప్టెంబరు 25వ తేదీ వరకు పది ట్రిప్పులు, 01438 ఈ నెల 26 నుంచి సెప్టెంబరు 27వ తేదీ వరకు పది ట్రిప్పులు నడుస్తుంది

ప్రతి మండలంలో మోడల్ కిచెన్‌లు

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

చింతకొమ్మదిన్నె: రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు క్రింద ఏర్పాటు చేస్తున్న ఆటోమేషన్ కిచెన్ (మోడల్ కిచెన్) లను జిల్లాలోని అన్ని మండలాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గురువారం చింతకొమ్మ దిన్నె మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, జె.కొత్తపల్లె ఉన్నత పాఠశాలలలో జరుగుతున్న సెంట్రలైజ్డ్ ఆటోమేషన్ కిచెన్ హాల్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం పాఠశాల లో సెంట్రలైజ్డ్ ఆటోమేషన్ ఆఫ్ కిచెన్స్ (మోడల్ కిచెన్) భవన నిర్మాణ పనులను పరిశీలించి సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వంట నిర్వాహకులతో మాట్లాడి పలు సూచనలు ఇచ్చారు. రాష్ట్రానికే ఆదర్శంగా జిల్లాలో నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ హాళ్లను జిల్లాలోని అన్ని మండలాల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, ఆగ్రోస్ డీఎం, సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్స్ నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, హౌసింగ్ పీడీ రాజరత్నం, సీకే దిన్నె తహసిల్దార్ నాగేశ్వరరావు, డీఈవో శంషుద్దిన్, ఏపీఎస్పీడిసిఎల్, ఆర్డబ్ల్యూఎస్, పీఆర్, ఎస్ఎస్ఏ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, ఎంఇఓ, ఆయా పాఠశాలల హెచ్ఎం, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జే.కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్ సెంట్రలైజ్డ్ ఆటోమేషన్ కిచెన్ ఏర్పాట్లపై సూచనలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

పీ-4 అమలుపై ప్రత్యేక శ్రద్ధ

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ4పథకం అమలుపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు బంగారు కుటుంబాల మ్యాపింగ్ ప్రకియ చేపట్టాలని సూచించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు సేవలు అందించడంలో ప్రజల నుంచి సానుకూలత పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ సేవలు సంతృప్త స్థాయిలో ప్రజలకు అందేలా అన్ని శాఖల జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ అదితిసింగ్, డీఆర్ఓ విశ్వేశ్వర నాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యాప్‌౦డి సారూ!

- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫేస్ రికగ్నైజేషన్‌లో ముప్పతిప్పలు
- యాప్‌ల నిర్వహణతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న అంగన్వాడీ కార్యకర్తలు
- బాలింతలు, గర్భిణుల గుర్తింపులో సరిగా పనిచేయని ఫేస్ రికగ్నైజేషన్ యాప్



లబ్ధిదారురాలికి ఐరీస్‌తీస్తున్న అంగన్వాడీ కార్యకర్త

జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలు:	2389
గర్భిణీలు:	10,534
బాలింతలు:	8079
3 ఏళ్లలోపు పిల్లలు:	65,335
ఆరేళ్లలోపు పిల్లలు:	53,162

కడప కోటిరెడ్డిసర్కిల్: అంగన్వాడీ కార్యకర్తలు యాప్‌లతో సతమతమవుతున్నారు. లబ్ధిదారులకు పోషణ ట్రాకర్ బాలసంజీవిని అందించడానికి ఒకటా రెండా.. నాలుగు యాప్‌లను నిర్వహించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా లబ్ధిదారుల ఫేస్ రికగ్నైజ్ చేసి యాప్‌లో నమోదు చేయాలి. ఇక్కడే చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఫేస్ రికగ్నైజ్ చాలామార్లు సక్సెస్ కావడం లేదని అంగన్వాడీ కార్యకర్తలు వాపోతున్నారు.రాష్ట్ర ప్రభుత్వం బాల సంజీవిని ద్వారా లబ్ధిదారులకు ఫేస్ రికగ్నైజేషన్ చేసి బియ్యం ఇస్తున్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పోషణ ట్రాకర్ ద్వారానే లబ్ధిదారులను గుర్తించి సరుకులు ఇవ్వాలన్న నిబంధనను తప్పనిసరి చేయడంతో కార్యకర్తలు రెండు యాప్‌లను నిర్వహించాల్సి వస్తోంది. ఇది చాలా కష్టంగా ఉందని పలువురు అంగన్వాడీ కార్యకర్తలు వాపోతున్నారు. ఈ యాప్‌ల గురించి ముందుగా శిక్షణ ఇప్పించాలని విన్నవిస్తున్నారు. పైగా అంగన్వాడీ కేంద్రాల్లో నెట్‌వర్క్ రావడం లేదని.. మొబైల్స్ ర్యామ్ తక్కువగా ఉండడంతో యాప్ స్పందించక తిప్పలు తప్పడం లేదని కార్యకర్తలు వాపోతున్నారు.



చిన్నారుల విద్యకు ఆటంకం

ఆయా అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలతోపాటు ఆరు నెలల నుంచి మూడేళ్ల చిన్నారులకు ప్రతినెల పోషకాహారాన్ని ఇంటి వద్దకే అందజేస్తున్నారు. గతంలో లబ్ధిదారులకు అంగన్వాడీ కేంద్రాల వద్దనే పోషకాహారాన్ని ఇచ్చేవారు. ఎక్కువ మంది తమకు ఇంటివద్దకే పోషకాహారం కావాలంటూ ప్రభుత్వాన్ని అభ్యర్థించడంతో టేక్ హోం రేషన్ (టీహెచ్ఆర్)గా మార్చి పాలు, కోడిగుడ్లు, నూనె, పప్పుదినుసులు, బియ్యం వంటివి ప్రతినెల రెండు దఫాలుగా అందిస్తున్నారు. నెలలో ఎక్కువ సమయం ఈ పనికే వినియోగించడం వల్ల చిన్నారుల ప్రాథమిక విద్యకు ఇబ్బందిగా మారిందని అంగన్వాడీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.దీంతోపాటు జిల్లాలోని అంగన్వాడీ కార్యకర్తలు ఆయా కేంద్రాల్లో 15 రకాల రికార్డులను నిర్వహించాల్సి వస్తోంది. దీనివల్ల చిన్నారుల ప్రాథమిక విద్యకు అనేక ఇబ్బందులు కలుగుతున్నాయని వాపోతున్నారు.

యాప్ పనిచేయక రేషన్ కోల్పోతున్నాం



నా ఫేస్ రికగ్నైషన్‌కు పోషణ్ యాప్ ద్వారా ఎన్నిమార్లు ఐరిస్ తీసినా వీలు కాలేదు. ఒకసారి సక్సెస్ వచ్చినా, రెండవసారి మ్యాచ్ కావడం లేదు. దీనివల్ల నేను రేషన్ కోల్పోతున్నాను. ప్రభుత్వం స్పందించి యాప్ కష్టాలను తొలగిస్తూ నిర్ణయం తీసుకోవాలి.

- స్రవంతి, లబ్ధిదారు, కడప

లక్ష్యం వైపు వసూళ్లు

- గతేడాది కంటే పెరిగిన మార్కెట్ కమిటీల సెస్సు
- 2025-26 ఏడాది లక్ష్యం రూ. 13.53 కోట్లు
- ఈ ఏడాది మూడు నెలలకు 2.98 కోట్లు వసూళ్లు



కడప మార్కెట్ యార్డు



కడప మార్కెట్‌యార్డులో కుప్పలుగా పోసిన పసుపు

జిల్లాలో చెక్‌పోస్టులు: 21

జిల్లాలో ఉన్న మార్కెటింగ్ కమిటీలు: 10

2025-26 సంవత్సరం ఫీజు లక్ష్యం: 13.53 కోట్లు

జూన్ చివరి నాటికి వసూళ్లయిన ఫీజు: రూ. 2.98 కోట్లు

కడప అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా మార్కెట్ కమిటీలు సెస్సు వసూళ్లలో మెరుగ్గా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న పది మార్కెట్ కమిటీలకు సంబంధించి 2025-26 ఏడాదికి మార్కెట్ సెస్సు వసూళ్లు రూ.13.53 కోట్లు లక్ష్యంగా నిర్దేశించింది. జూన్ చివరి నాటికి రూ. 2.98 కోట్లు వసూలైంది. జిల్లాలో పది మార్కెట్ కమిటీల్లో కొన్ని వసూళ్లలో దూసుకుపోతుండగా.. మరికొన్ని వెనుకబడి ఉన్నాయి.

నాలుగు ఏఎంసీలు వసూళ్లలో మైనస్‌లో ఉంది...

జిల్లాలోని పది అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ(ఏఎంసీలు)లు ఉన్నాయి. ఇందులో ప్రొద్దుటూరు, బద్వేల్, కమలాపురం, సిద్దవటం ఏఎంసీలు వసూళ్లలో గతేడాది కంటే తక్కువగా వసూలైంది. మిగతా కడప, జమ్మలమడుగు, పులివెందుల, మైదుకూరు, ఎర్రగుంట్ల, సింహాద్రిపురం ఏఎంసీల వసూళ్లు గతేడాదికంటే ఎక్కువగా ఉన్నాయి. ఇందులో భాగంగా కడప మార్కెట్ కమిటి లక్ష్యం ఈ ఏడాది రూ. 205 లక్షలకుగాను ఏప్రిల్, మే, జూన్ మూడు నెలల కలిపి జూన్ చివరి నాటికి రూ. 69.12 లక్షలు వసూలైంది. అలాగే బద్వేల్ మార్కెట్ కమిటీ లక్ష్యం రూ. 205 లక్షలు కాగా జూన్ చివరి నాటికి రూ.54.51 లక్షలు, ప్రొద్దటూరు మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.199 కాగా జూన్ చివరినాటికి రూ. 21.53 లక్షలు, పులివెందుల మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.108 లక్షలు కాగా జూన్ చివరి నాటికి రూ. 29.91 లక్షలు, మైదుకూరు మార్కెట్ కమిటీ లక్ష్యం రూ. 280 లక్షలుకాగా జూన్ చివరి నాటికి రూ. 73.84 లక్షలు, సిద్దవటం మార్కెట్ కమిటీ లక్ష్యం రూ. 28 లక్షలు కాగా జూన్ చివరి నాటికి రూ. 4.18 లక్షలు, ఎర్రగుంట్ల మార్కెట్ కమిటి లక్ష్యం రూ. 86 లక్షలు కాగా ఈ ఏడాది జూన్ చివరి నాటికి రూ. 15.28 లక్షలు, సింహాద్రిపురం మార్కెట్ కమిటి లక్ష్యం రూ. 24 లక్షలు కాగా ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.5.24 లక్షలు వసూలు అయ్యింది.

- కడప మార్కెట్ కమిటీలో పసుపు, వేరుశనిగ సంబంధించిన క్రయవిక్రయాలు జరగ్గా.. మిగతా మార్కెట్ కమిటీల్లో పండ్లు ఇతర ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరుగుతాయి.

జిల్లాలో 21 చెక్ పోస్టులు....

జిల్లాలో పది మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వీటి పరిధిలో 21 చెక్ పోస్టులు ఉన్నాయి. ఇందులో కడప మార్కెట్ కమిటీలో పసుపు, వేరుశనగ వంటివి క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. అందుకే కడప మార్కెట్ కమిటి నుంచే ఎక్కువగా సెస్ వసూలు అవుతుంది.

లక్ష్యాన్ని అధిగమించేందుకు చర్యలు



జిల్లాలో 2024-25 ఏడాదికి 10 మార్కెట్ కమిటీల పరిధిలో 21 చెక్ పోస్టులు ఉన్నాయి. అయా చెక్ పోస్టుల ద్వారా వార్షిక ఆదాయం ఏడాదికి రూ. 13.53 కోట్లు వసూలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టింది. ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ నెలలకు కలిసి రూ. 298.16 లక్షల సెస్సు వసూలు చేశాము. ఆగస్టు నుంచి సీజన్ ప్రారంభమౌతుంది. అప్పుడు వసూళ్లు బాగా పెరుగుతాయి.

- ఆజాద్ వల్లి, మార్కెటింగ్‌శాఖ ఇన్‌చార్జ్ ఏడీ

ఆదాయపు పన్నుతోనే దేశాభివృద్ధి

కడప ఎడ్యుకేషన్: ఆదాయపు పన్నుతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆదాయపు పన్నుశాఖ అధికారి సత్యనారాయణ పేర్కొన్నారు. కడప నగర శివార్లలోని స్పిరిట్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం ఆదాయ పన్నుశాఖ అధికారులు ఇన్‌కామ్ టాక్స్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు ఆదాయపన్ను కట్టి మన దేశాభివృద్ధికి పాటు పడాలన్నారు. ఆదాయపన్ను శాఖ-2 రఘురామయ్య ఆదాయపు పన్ను లక్ష్యాలను వివరించి విద్యార్థులకు ఆదాయపు పన్ను గురించి ఒక లఘు చిత్రన్ని ప్రదర్శించి ప్రశ్నలు అడిగి వారి ద్వారా సమాధానాలను రాబట్టారు. బాగా సమాధానాలు చెప్పిన ముగ్గురు విద్యార్థులకు ప్రశంసపత్రాలను అందచేసి అభినందించారు. కళాశాల డైరెక్టర్ రవీంద్ర, విద్యార్థులు, అధ్యాపకులు, ఆదాయపు పన్నుశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆధాయపు పన్నుశాఖ అధికారి-1 సత్యనారాయణ

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య

కమలాపురం : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలోని పాపాఘ్ని నదిపై ఉన్న పాత వంతెన వద్ద కడప నగరానికి చెందిన సయ్యద్ రసూల్ (52) విష ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కడపకు చెందిన సయ్యద్ రసూల్ బుధవారం కమలాపురంలో ఉన్న తన కుమార్తె జైబీన్ ఇంటికి వచ్చాడు. పాపాఘ్ని నది వద్దకు వెళ్లి వంతెన కింద విష ద్రావణం తాగి తన కుమార్తెకు ఫోన్ చేసి తనను దేవుడు రమ్మంటున్నాడని, తాను బ్రిడ్జి వద్ద ఉన్నానని, మీ అమ్మను జాగ్రత్తగా చూసుకోమని చెప్పాడు. దీంతో కుటుంబీకులు హుటాహుటిన బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. అప్పటికే అతను అపస్మారక స్థితిలో పడి ఉండటంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కాగా మృతుని కుటుంబ సభ్యులు కమలాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ విద్యాసాగర్ కేసు నమోదు చేశారు.

లారీ ఢీ కొని రెండు గేదెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

కొండాపురం : మండల పరిధిలోని ఓబన్నపేట పునరావాస కేంద్రం సమీపంలోని జాతీయ రహదారిలో పాల లారీ ఢీ కొని రెండు పాడి గేదెలు మృతి చెందాయి. స్థానికుల వివరాల మేరకు మండలంలోని ఓబన్నపేట గ్రామ రైతు తలారి పెద్ద గుర్రప్పకు చెందిన పాడి గేదెలు మేతకోసం వెళ్లి తిరిగి వస్తుండగా ముద్దనూరు వైపు నుంచి వస్తున్న పాలలారీ ఢీ కొంది. దీంతో రెండు పాడిగేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో గేదెకు తీవ్ర గాయాలయ్యాయి. గేదెల విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు.

బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడి అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అల్మాస్‌పేటకు చెందిన బాలిక(17)ను ఈనెల 16న అదే ప్రాంతానికి చెందిన సత్యరాజ ముని శ్రావణ్‌కుమార్ (22) అనే యువకుడు మాయమాటలు చెప్పి, కిడ్నాప్ చేసుకుని తీసుకుని వెళ్లాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కడప టూటౌన్ ఎస్ఐ ఎస్‌కెఎం హుసేన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎట్టకేలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బాలికను, నిందితుడిని పట్టుకున్నారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బాలికలు, మహిళలపట్ల ఎవరైనా వేధింపు చర్యలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైరు చోరీ



ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

ముద్దనూరు : మండలంలోని ఆరవేటిపల్లె గ్రామంలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని కాపర్‌వైరును బుధవారం రాత్రి చోరీ చేసినట్లు బాధిత రైతు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రివేళ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టారని, దీంతో విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరా తీయండి.. ఆట కట్టించండి!

- పోలీసు స్టేషన్‌కు క్యూకట్టిన ఆరా యాప్ బాధితులు
- ఇతర జిల్లాల నుంచి మదనపల్లె స్టేషన్‌లో ఫిర్యాదు
- ఉదయం నుంచి రాత్రి వరకు స్టేషన్ వద్దే నిరీక్షించిన బాధితులు



వన్ టౌన్ పోలీసు స్టేషన్ వద్ద ఆరా యాప్ నిందితుడు మోహన్‌బాబును చుట్టుముట్టిన బాధితులు



ఆరా కంపెనీ ప్రొఫైల్

మదనపల్లె రూరల్/కురబలకోట : ఆరా యాప్ మోసానికి బలైన బాధితులు గురువారం పెద్ద ఎత్తున మదనపల్లె వన్ టౌన్ పోలీసు స్టేషన్‌కు క్యూ కట్టారు. వీడియోలు చూస్తే చాలు డబ్బులు వస్తాయన్న అత్యాశకు పోయి ఆరా యాప్‌లో పెట్టుబడి పెట్టి యాప్ నిర్వాహకులచే మోసానికి గురై లక్షల్లో నగదు వేల సంఖ్యలో బాధితులు పోగొట్టుకున్నారు. ఆరా యాప్ మోసంపై పత్రికల్లో పెద్ద ఎత్తున వార్తలు రావడంతో వందల సంఖ్యలో బాధితులు బయటకు వచ్చారు. తాము యాప్‌లో ఏ విధంగా పెట్టుబడి పెట్టామో, తమను మాయ మాటలతో ఎలా మోసం చేశారో విలేకరులకు వివరించారు. మదనపల్లె దిగువ కురవంకకు చెందిన మోహన్‌బాబు అనే వ్యక్తి నిర్వాహకుడిగా వ్యవహరిస్తున్న ఆరా యాప్ ద్వారా లక్షల్లో ప్రజల సొమ్ము కాజేసి చేతులెత్తేశాడు. వారం రోజులుగా యాప్ ద్వారా నగదు విత్‌డ్రా చేసుకునే సౌకర్యాన్ని నిలిపి వేయడంతో బాధితులు మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. సత్యసాయి జిల్లా, కర్నాటక రాష్ట్రం చింతామణి, మదనపల్లె డివిజన్‌లోని పెద్దమండ్యం, మదనపల్లె, కలికిరి తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున బాధితులు వన్ టౌన్ పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. యాప్‌లో పెట్టుబడి పెట్టిన సభ్యులకు మొదట్లో కొంత మందికి నగదు ,బహుమతులు ఇచ్చి పెద్ద సంఖ్యలో ప్రజలను ఆకర్షించి భారీ మోసానికి తెరదీశారు. మోసపోయిన బాధితులు యాప్ ద్వారా నగదు విత్‌డ్రా చేసుకునేందుకు బ్యాంకు వ్యక్తిగత ఖాతా వివరాలు, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు తదితర వివరాలు యాప్‌కు లింక్ చేశామని, దీని వల్ల తాము భవిష్యత్తులో నష్టపోకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు ఆరా యాప్ బాధితులు వన్ టౌన్ పోలీసు స్టేషన్ ఎదుట పడిగాపులు కాశారు. రాత్రి వరకు 300కుపైగా బాధితులు తాము నష్టపోయినట్లు ఫిర్యాదు చేశారు. పెద్ద సంఖ్యలో బాధితులు వన్ టౌన్ పోలీసు స్టేషన్‌కు చేరుకోవడంతో పోలీసులు అప్రమత్తమై మోహన్‌బాబును అదుపులో తీసుకుని డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. అక్కడే నిందితుడి వద్ద యాప్‌కు సంబంధించిన వివరాలు, వ్యాపార లావాదేవీలు, అందుకు సంబంధించిన అనుమతులు తదితర అంశాలపై విచారించారు. అనంతరం నిందితుడిని రాత్రి వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించగా అప్పటి వరకు అక్కడే వేచివున్న బాధితులు పోలీసుల సమక్షంలోనే నిందితుడిని చుట్టుముట్టారు. తమకు యాప్‌లో నగదు విత్‌డ్రా అయ్యేలా వెంటనే చర్యలు తీసుకోవాలని వన్‌టౌన్ సీఐ ఎరిసావలీని కోరారు. యాప్ నుంచి నగదు విత్‌డ్రా చేసుకునేందుకు మోహన్‌బాబు ద్వారా మెసేజ్ పెట్టించారు. అయినా బాధితుల అకౌంట్లు పునరుద్ధరించడం వీలుకాదంటూ యాప్ నిర్వాహకుల నుంచి తిరుగు మెసేజ్ రావడంతో సభ్యులంతా ఒక్కసారిగా తాము పూర్తిగా మునిగిపోయామని తమ నగదు తిరిగి రాదని సీఐ,ఎస్ఐలకు వివరించారు. అనంతరం నిందితుడు మోహన్‌బాబును పోలీసులు అదుపులో తీసుకున్నారు. ఈ విషయమై డీఎస్పీ మహేంద్ర మాట్లాడుతూ భారీ ఆన్‌లైన్ మోసానికి పాల్పడిన మోహన్‌బాబుపై కేసు నమోదు చేస్తామన్నారు. విచారణలో పూర్తి విషయాలు తెలుస్తాయన్నారు. బాధితులు ఎవరైనా ఉంటే స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు.

దేశ వ్యాప్తంగా 30 లక్షల మందికి పైగా బాధితులు

ఈ స్కీంలో వారు వీరు అని కాకుండా వివిధ వర్గాల వారు మోసపోయారు. ఆరా యాప్‌లోనే దేశ వ్యాప్తంగా 30లక్షల మందికి పైగా కస్టమర్లు ఉన్నట్లు చూపారు. వేగవంతంగా ప్రాబల్యం పొందింది. కోట్లలో కొల్లగొట్టారు. నిర్వాహకులు ఎవరో ఎవరికీ తెలీదు. అంతా వాట్సప్ చాటింగ్ ద్వారా లావాదేవీలు నిర్వహించారు. రెండు రోజులుగా టాస్కులు కూడా ఓపన్ కాలేదు. యాక్టివేషన్ చేసుకోవాలని నిర్ణీత నగదు చెల్లిస్తే టాస్కులు వస్తాయని కండిషన్ పెట్టారు. అసలుకే ఎసరు పడటంతో మళ్లీ నగదు చెల్లించి యాక్టివేషన్ ఎలా అని దిక్కుతోచని స్థితిలో బాధితులు కొట్టుమిట్టాడుతున్నారు.

దొరకరంతే..

ఆరా యాప్ నిర్వాహకులను నేరుగా చూసిన వారు మాట్లాడిన వారు లేరు. కార్యకలాపాలన్నీ వాట్సప్ చాటింగ్ ద్వారానే జరిగాయి. చట్టానికి దొరక్కుండా మొదటి నుండి జాగ్రత్త పడ్డారు. ఇండియా ప్రతినిధిగా లూధియా పేరుతో లావాదేవీలు నిర్వహించారు. ప్రధాన కార్యాలయం లండన్‌లో ఉన్నట్లు ప్రొఫైల్‌లో చూపారు. లక్షలాది మందిని నిలువునా ముంచేసిన నిర్వాహకులపై తగు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కూటమి ప్రభుత్వాన్ని, పోలీసులను బాధితులు కోరుతున్నారు.

నిందితులకు వైద్య పరీక్షలు



నిందితులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తొండూరు : ఇటీవల సైదాపురం బస్టాప్ సమీపంలో జరిగిన దాడి కేసులో నిందితులైన తొండూరు మండలం ఇనగలూరు గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దాడి కేసుకు సంబంధించి ఐదుగురు నిందితులను బుధవారం పోలీసులు రిమాండ్‌కు పంపారు. జడ్జి ఎదుట పోలీసులు తమను చితకబాదారని నిందితులు వాపోయారు. దీంతో జడ్జి నిందితులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. నేపథ్యంలో పులివెందుల ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి నివేదికను కోర్టుకు అందించనున్నట్లు తెలిసింది.

సినిమా థియేటర్ వద్ద ఘర్షణ



కడప అర్బన్ : డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కథా నాయకుడిగా నటించిన హరహర వీరమల్లు చలనచిత్రం ఈనెల 23న రాత్రి ప్రీమియం షో విడుదల చేశారు. ఈ సినిమా విడుదల సందర్భంగా బుధవారం రాత్రి కడప నగరంలోని రాజా (రహత్) సినిమా థియేటర్ వద్ద అభిమానుల మధ్య జరిగిన వాగ్వాదం కాస్త ఘర్షణకు దారి తీసింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి ఘర్షణను సద్దుమణిగేలా చేశారు.

మీడియాకు ప్రశ్నించే హక్కు లేదు..!



బయటకు పోండంటూ విలేకరులపై విరుచుకుపడుతున్న ఎంపీడీఓ విష్ణుప్రసాద్

తొండూరు : మీడియాకు ప్రశ్నించే హక్కే లేదంటూ గురువారం జరిగిన మండల సమావేశంలో విలేకరులపై ఎంపీడీఓ విష్ణుప్రసాద్ చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా దుమారం రేపుతున్నాయి. తొండూరు ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీడీఓ విష్ణుప్రసాద్ అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 15వ ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగంపై అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చిస్తుండగా.. దీనిపై విలేకరులు నిధుల వినియోగంపై స్పష్టతను కోరారు. దీనిపై ఎంపీడీఓ విలేకరులపై ఒక్కసారిగా మీకు ప్రశ్నించే హక్కు లేదు, కేవలం సమాచారం అడగడమే మీ పని అంటూ విలేకరులపై అసభ్య వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. విలేకరులు హద్దుమీరి ప్రవర్తిస్తే వాళ్ల మీద కేసులు పెట్టండి నేను చూసుకుంటానని జిల్లా కలెక్టర్ చెప్పారని ఎంపీడీఓ తెలిపారు. ఒక అధికారిపై అక్రమాల ఆరోపణలుంటే మీడియా ప్రశ్నించడం తప్పుకాదని, దానిపై అసభ్యంగా స్పందించడమే చట్ట వ్యతిరేకమని స్థానిక విలేకరులు అంటున్నారు. కలెక్టర్ స్పందించి ఎంపీడీఓ విష్ణుప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని స్థానిక పాత్రికేయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

వీఏఏ, వీహెచ్ఏలకు జిల్లా వ్యవసాయ అధికారి సూచన



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్

కడప అగ్రికల్చర్ : గ్రామీణ ప్రాంతాలలోని రైతులకు ప్రకృతి వ్యవసాయ సాగును ప్రోత్సహించి ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించేందుకు మండల వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్రాల విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, విలేజ్ హారికల్చర్ అసిస్టెంట్లు కృషి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ సూచించారు. గురువారం కడపలోని ప్రకృతి వ్యవసాయ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రకృతి వ్యవసాయంపై రైతు సేవా కేంద్రాల వీఏఏ, వీహెచ్ఏలకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మొదటి రోజు కడప వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని పెండ్లిమర్రి, ఖాజీపేట, చెన్నూరు,ఒంటిమిట్ట, చింతకొమ్మదిన్నె, కడప మండలాల రైతు సేవా కేంద్రాల వీఏఏ, వీహెచ్ఏలు పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విచక్షణా రహితంగా ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించడం వలన నేల సారవంతంతోపాటు పర్యావరణాన్ని కాపాడుకోవచ్చనే విషయాలను రైతులకు తెలియజేయాలన్నారు. అలాగే పంటసాగు చేసిన ప్రతి రైతుకు ఈ–పంట నమోదు చేయాలన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్ర మాట్లాడుతూ ఉద్యాన పంటలైన అరటి, నిమ్మ పంటలను ఏ విధంగా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించవచ్చో వివరించారు. కడప సహాయ సంచాలకుడు సురేష్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా ప్రకృతి వ్యవసాయ పద్ధతులైన జీవామృతం, ఘణ జీవామృతం, ద్రవ జీవామృతం, కషాయలు ఏవిధంగా తయారు చేసుకోవాలో తెలుసుకుని రైతులకు తెలియజేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు కృష్ణసుమంత్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, శ్రీదేవి, నాగార్జున, జయలక్ష్మి, ఉద్యానశాఖ అధికారి జీవన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు సేవా కేంద్రాల వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

ఇదేంది తిరుమలేషా.!

- వెలుగులోకి టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడి మరో అవినీతి బాగోతం
- సీఎంఆర్ పొలిటికల్ న్యూస్ గ్రూప్‌లో హల్‌చల్

కడప రూరల్ : తెలుగుదేశం పార్టీ టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్ అవినీతి వ్యవహారం కొత్త పుంతలు తొక్కుతోంది. మహానాడు సందర్భంగా వివిధ విద్యా సంస్థల నుంచి డబ్బుల వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి ప్రెస్‌మీట్ పెట్టారు. తిరుమలేష్ ఎలాంటి తప్పు చేయలేదని, అతనిపై తాము ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పుకొచ్చారు. పైగా అతనే స్వచ్ఛందంగా రాజీనామా చేసి, తప్పు చేసి ఉంటే చర్యలు తీసుకోవాలని చెప్పినట్లుగా తెలిపారు. దీంతో అందరూ ముక్కున వేలేసుకున్నారు. ఈ అంశం మరువకముందే అధికార పార్టీకి చెందిన సీఎంఆర్ పొలిటికల్ న్యూస్ గ్రూప్‌లో తిరుమలేష్‌పై మరొక అవినీతి ఆరోపణ హల్‌చల్ చేస్తోంది. ఆ పార్టీకే చెందిన కడప 43వ డివిజన్ ఇన్‌చార్జి కొరముట్ల మాధవయ్య, తిరుమలేష్‌పై ఆ గ్రూప్ వేదికగా అవినీతి ఆరోపణలు చేయడం గమనార్హం. అందులో తన కుమారుడు ఒక ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతున్నాడు. ఆబ్సెంట్ కారణంగా పరీక్ష రాయడానికి కాలేజీ యాజమాన్యం అనుమతించలేదు. దీంతో తాను తిరుమలేష్‌ను సంప్రదించి తన కొడుకు పరీక్ష రాసేలా కాలేజీ యాజమాన్యంతో మాట్లాడమని చెప్పాను. ఇందుకు అతను రూ.10 వేలు ఇస్తే మాట్లాడతానని డిమాండ్ చేశాడు. తాను కూడా టీడీపీలోనే ఉన్నాను. మాధవిరెడ్డి గెలుపు కోసం కృషి చేశాను. నన్నే డబ్బు అడుగుతావా అన్నాను. అందుకు తిరుమలేష్ నన్ను బెదిరించాడు. డబ్బిస్తేనే మాట్లాడతానని దౌర్జన్యం చేశాడు. పార్టీలో ఉన్న నన్నే డబ్బులు డిమాండ్ చేశాడంటే స్కూళ్లు, కాలేజీల్లో ఎంతమందిని బెదిరించాడో. ఇలాంటి వ్యక్తిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి. అంటూ టీడీపీకి చెందిన గ్రూప్‌లోనే ఈ అంశం రావడంపై ఆ పార్టీతో పాటు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

జిల్లా సమగ్రాభివృద్ధికి రాజీలేని పోరాటాలు

ముగిసిన సీపీఐ జిల్లా మహాసభలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి, కార్యవర్గ సభ్యులు

బద్వేలు అర్బన్ : జిల్లా సమగ్రాభివృద్ధికి సీపీఐ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పేర్కొన్నారు. బద్వేలులో మూడు రోజుల పాటు జరిగిన సీపీఐ జిల్లా మహాసభలు గురువారంతో ముగిశాయి. ఇందులో భాగంగా స్థానిక సీపీఐ కార్యాలయం జేవీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తిచేసి నిరుద్యోగ యువతను ఆదుకోవాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న గాలేరు–నగరి, తెలుగుగంగ, రాజోలి, వెలిగొండ రెండవ దశ పనులను పూర్తి చేయడంతో పాటు నికర జలాలు కేటాయించాలని కోరారు. సోమశిల, గండికోట, గాలేరు–నగరి ప్రాజెక్టుల పరిధిలోని నిర్వాసితులకు వెంటనే పరిహారం చెల్లించి పునరావాసం కల్పించాలని కోరారు. కడప నగరాన్ని స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చేయడంతో పాటు ప్రొద్దుటూరు, బద్వేలు, మైదుకూరు, యర్రగుంట్ల, జమ్మలమడుగు, పులివెందుల పట్టణాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. కడప – బెంగుళూరు రైల్వే పనులు పూర్తి చేయడంతో పాటు మూతపడ్డ చెన్నూరు చక్కెర ఫ్యాక్టరీ, ప్రొద్దుటూరు పాలకేంద్రాలను తెరిపించాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

సీపీఐ జిల్లా మహాసభల సందర్భంగా గురువారం జరిగిన ప్రతినిధుల సభలో నూతన జిల్లా కార్యదర్శితో పాటు 17 మంది కార్యవర్గ సభ్యులను, 79 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. ఇందులో జిల్లా కార్యదర్శిగా గాలిచంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులుగా బి.రామయ్య, ఎల్.నాగసుబ్బారెడ్డి, పి.చంద్రశేఖర్, ఎస్.వెంకటశివ, పి.సుబ్బరాయుడు, సి.సుబ్రమణ్యం, వి.వీరశేఖర్, ఎం.వి.సుబ్బారెడ్డి, జి.వేణుగోపాల్, విజయలక్ష్మి, శ్రీరాములు, కె.సి.బాదుల్లా, గంగాసురేష్, పి.బాలు, జి.మద్దిలేటి, శంకర్‌నాయక్, వెంకటరాముడులను ఎన్నుకున్నారు. సమావేశంలో పలువురు జిల్లా కార్యవర్గ సభ్యులతో పాటు సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి మస్తాన్, రూరల్ కార్యదర్శి ఇమ్మానియేలు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎర్రచందనం దొంగల అరెస్ట్

- 14 దుంగలు, కారు స్వాధీనం
- పరారీలో మరో ముగ్గురు. ఎర్రచందనం విలువ రూ.1.50 లక్షలు



పట్టుబడిన కారు, దొంగలు, దుంగలతో ఎస్ఐ చిన్న పెద్దయ్య, పోలీసు సిబ్బంది

చాపాడు : మైదుకూరు – ప్రొద్దుటూరు జాతీయ రహదారిలోని నాగులపల్లె సమీపంలో బుధవారం ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 14 దుంగలు, కారును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. ప్రొద్దుటూరు మండలంలోని మీనాపురం వద్ద గల జగనన్న కాలనీలో నిల్వ ఉంచిన 14 ఎర్రచందనం దుంగలను ఏపీ07సీఏ9939 నెంబరు గల వోక్స్ వ్యాగన్ కారులో మైదుకూరు వైపు తరలిస్తున్నారు. తమకు అందిన సమాచారం మేరకు రూరల్ సీఐ శివశంకర్ ఆదేశాలతో మండలంలోని నాగులపల్లె వద్ద గల పెట్రోల్ బంక్ సమీపంలో వాహన తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న కారు వేగంగా వస్తుండగా సిబ్బంది అడ్డుకోబోగా వారిపై దూసుకెళ్లి తప్పించుకుని వెళ్తుండగా చాకచక్యంగా కారును పట్టుకున్నారు. పట్టుబడిన కారు నుంచి ముగ్గురు దొంగలు పారిపోగా, ప్రొద్దుటూరు మండలం ఖాదర్‌బాద్‌కు చెందిన బోయ కుమార్, బోయ కిషోర్ అనే వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 14 ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన దుంగలు 281 కేజీలు ఉండగా వీటి విలువ అధికారికంగా రూ.1.50లక్షలు ఉంటుంది. అనధికారికంగా రూ.15లక్షలు ఉంటుంది. ఈ ఘటనపై కేసు నమోదు దర్యాప్తు చేసి పారిపోయిన మరో ముగ్గురు దొంగలను త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు బాషా, నాగేంద్రప్రసాద్ ఎఫ్‌బీఓ హరినాథరాజు, కానిస్టేబుళ్లు మధు, అభిరాం, బ్రహ్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది తరగతులు..ముగ్గురు ఉపాధ్యాయులు

- విద్యాశాఖలో వింత పోకడలు
- ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులకు ఇక్కట్లు



చింతలచెరువులోని ప్రాథమికోన్నత పాఠశాల

బద్వేలు : మండల పరిధిలోని చింతలచెరువు గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుండి 8 వరకు తరగతులు ఉన్నాయి. అందులో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకూ 20 మంది విద్యార్థులు ఉండగా 6,7,8 తరగతుల్లో 18 మంది విద్యార్థులు ఉన్నారు. ఆరు నుంచి ఎనిమిదవ తరగతి వరకు సబ్జెక్ట్‌ల వారీగా ఆరుగురు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉంది. కానీ ఇక్కడ ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఒకటి నుంచి ఎనిమిదవ తరగతి వరకు బోధిస్తున్నారు.

మూడు పాఠ్యాంశాల బోధన ఒకరిచేతే..

ఇటీవల విద్యాశాఖలో జరిగిన బదిలీల్లో చింతలచెరువు పాఠశాలకు ఇద్దరు మాత్రమే స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు వచ్చారు. వారిలో ఒకరు ఇంగ్లీషు టీచర్ కాగా మరొకరు గణిత శాస్త్రం ఉపాధ్యాయురాలు. గణితం ఉపాధ్యాయురాలు గణితం, జీవశాస్త్రం, భౌతికశాస్త్రం బోధిస్తుండగా ఇంగ్లీషు ఉపాధ్యాయుడు ఇంగ్లీషు, సాంఘీక శాస్త్రం పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. తెలుగు, హిందీ పాఠ్యాంశాలు బోధించే ఉపాధ్యాయుల నియామకం జరగలేదు. దీంతో 6,7,8 తరగతుల విద్యార్థులకు ఆ రెండు భాషలను బోధించే ఉపాధ్యాయులు కరువయ్యారు. దీనిపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాన్‌వెస్లీ మాట్లాడుతూ కనీసం డిప్యుటేషన్‌పై అయినా ఉపాధ్యాయులను నియమిస్తే విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. కాగా ఎంఈఓ–1 చెన్నయ్య మాట్లాడుతూ పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయుల నియామకం జరిగిందన్నారు. సబ్జెక్టుల వారీగా నియమించలేదన్నారు. ప్రభుత్వం నిబంధనల మేరకే ఉపాధ్యాయులను కేటాయించిందని స్పష్టం చేశారు.

పదిమంది విద్యార్థులు.. ముగ్గురు ఉపాధ్యాయులు



చిన్నకేశంపల్లె ప్రాథమిక పాఠశాల

మండలంలోని చిన్నకేశంపల్లె ప్రాథమిక పాఠశాలలో పదిమంది విద్యార్థులు ఉండగా ముగ్గురు ఉపాధ్యాయులను నియమించారు. మిగతా పాఠశాలల్లో నిబంధనల ప్రకారం 30మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని నియమించిన విద్యాశాఖాధికారులు ఇక్కడ మాత్రం 10 మంది విద్యార్థులకు ముగ్గురిని నియమించడం చర్చనీయాంశమైంది. ఈ విషయమై ఎంఈఓ చెన్నయ్యను వివరణ కోరగా ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో అక్కడికి ముగ్గురు ఉపాధ్యాయులను బదిలీ చేశారని తెలిపారు. వారిని అవసరమున్నచోటికి డిప్యుటేషన్‌పై పంపిస్తామని తెలిపారు.

ప్రభుత్వం చేసిన అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ 14 మాసాల్లో ఎన్ని అప్పులు చేశారో, అవి దేనికి ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను తాకట్టు పెట్టి ఈ ప్రభుత్వం రూ.1.86 లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు. ఎన్నికల్లో పచ్చి అబద్ధాలు చెప్పి, ప్రజలకు బాండ్లు ఇచ్చి ఓట్లు దండుకొని ఇప్పుడు మోసం చేస్తున్నారన్నారు. అన్నీ లెక్కలేసుకున్నాం...ప్రతి పథకమూ అమలు చేస్తాం...అలా చేయకపోతే చొక్కా పట్టుకొని నిలదీయాలని చంద్రబాబు, లోకేష్ చెప్పారన్నారు. ఇప్పుడు వారిని చొక్కాపట్టుకొని నిలదీసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో ఇంటింటికీ తిరుగుతున్న సమయంలో ఈ ప్రభుత్వానికి ఓటేసి మోసపోయామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేస్తే ఆంధ్రాను అమ్మేయాలని అచ్చెన్నాయుడు చెప్పడాన్ని బట్టి చూస్తే ఆ పథకం అమలు చేసే ఉద్దేశం లేదని అర్థమవుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ చేసిన ఉద్యమాల వల్లే 'తల్లికి వందనం' అరకొరగా అమలు చేశారన్నారు. ఇంకా చాలా మంది అర్హులైన తల్లులకు డబ్బులు పడలేదన్నారు. 20లక్షల ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగులకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని, ఇప్పుడు దాన్ని స్కిల్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అప్పగించడం దారుణమన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, చిన్నారులు, మహిళలకు రక్షణ కరువైందన్నారు. మద్యం కేసులో ప్రభుత్వం చెప్పేవన్నీ భేతాళ కథలేనన్నారు. సంబంధం లేని వారిని ఇందులో ఇరికించి అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ఈ ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ పులి సునీల్ కుమార్, ఈస్ట్ జోన్ అధ్యక్షుడు బీహెచ్ ఇలియాస్, వలంటీర్స్ విభాగం నాయకులు అఖిల్, భాస్కర్‌రెడ్డి, వంశీ పాల్గొన్నారు.